ప్రతి వ్యక్తి ఆరోగ్యమే లక్ష్యంగా..

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు సిద్ధం
- 1వ తేదీ నుంచి జేఏసీ క్యాంపులు ప్రారంభం



గొల్ల కంచరపాలెం దరి తోటవీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న సిబ్బంది, వలంటీర్లు

కంచరపాలెం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా అక్టోబర్ ఒకటి నుంచి 45 రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించడానికి సర్వే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు జోన్-5 పరిధిలోని విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లోని యూపీహెచ్‌సీలను సిద్ధం చేశారు. ఆయా యూపీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఈ నెల 14 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తున్నారు.

యూపీహెచ్‌సీల వారీగా..

జోన్-5 పరిధిలోని యూపీహెచ్‌సీలు బాపూజీనగర్, ములగాడ, కంచరపాలెం(ఆర్పీపేట), రైల్వే న్యూకాలనీ, నరసింహనగర్, ఇందిరానగర్, శివనగర్, విద్యుత్‌నగర్(ఎన్‌జీజీవో కాలనీ), అంబేడ్కర్ కాలనీ, భవానీగార్డెన్స్, ఏఎస్ఆర్‌నగర్, గాంధీజీవీధి(మల్కాపురం)లో ఆయా సచివాలయాల సిబ్బంది సర్వే చేస్తున్నారు. రక్తపోటు(బీపీ), షుగర్ పరీక్షలు చేస్తున్నారు. రక్తహీనతతో బాధపడేవారు, పౌష్టికాహార లోపంతో బాధపడేవారిని ఈ సర్వేలో గుర్తిస్తున్నారు. జోన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బరువు తక్కువ, రక్తహీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి మందులు అందిస్తున్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు.. తేదీలు

యూపీహెచ్‌సీ	సచివాలయాలు	శిబిరం తేదీ
బాపూజీనగర్	07	అక్టోబర్-04(బుధవారం)
ములగాడ	06	అక్టోబర్-05(గురువారం)
కంచరపాలెం(ఆర్పీపేట)	07	అక్టోబర్-06(శుక్రవారం)
రైల్వేన్యూకాలనీ,	08	అక్టోబర్-07(శనివారం)
నరసింహానగర్,	05	అక్టోబర్-10(మంగళవారం)
ఇందిరానగర్	06	అక్టోబర్-11(బుధవారం)
శివనగర్,	11	అక్టోబర్-13(శుక్రవారం)
విద్యుత్‌నగర్(ఎన్‌జీజీవో)	11,	అక్టోబర్-16(సోమవారం)
అంబేడ్కర్‌కాలనీ,	09	అక్టోబర్-17(మంగళవారం)
భవానీగార్డెన్స్	08	అక్టోబర్-18(బుధవారం)
ఏఎస్ఆర్‌నగర్,	08	అక్టోబర్-19(గురువారం)
గాంధీజీవీధి(మల్కాపురం)	04	అక్టోబర్-19(గురువారం)

దీర్ఘకాలిక వ్యాధులకు స్పెషలిస్ట్‌లతో వైద్యం

దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ సమస్యలు లాంటివి గుర్తిస్తున్నారు. వారిని ఆయా యూపీహెచ్‌సీ పరిధిలోని నిర్వహించే వైద్య శిబిరాలకు తరలించి స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు తరలించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా అవసరమయ్యే వైద్యఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి అనారోగ్య సమస్యలను తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు స్పందన



జోన్-5 పరిధిలో 13 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు మంచి స్పందన లభిస్తుంది. యూపీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జోన్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి 'జేఏసీ' వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలు ప్రజలకు తెలియజేస్తున్నాం. అక్టోబర్ 04 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంప్‌లను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

–ఆర్జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5. జ్ఞానాపురం

జోన్-8లో చురుగ్గా సర్వే

గోపాలపట్నం: జోన్-8లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. తొలి విడతలో జీవీఎంసీ 89 వార్డు చంద్రనగర్‌లో, 97వ వార్డు చినముషిడివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపడుతున్నట్టు ఏఎంహెచ్‌వో కృష్ణరాజు తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 30 వరకు ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు నిర్వహించనున్నామని చెప్పారు.

వైద్య శిబిరాల షెడ్యూల్ ఇదీ

- అక్టోబర్ 4న 97వ వార్డు చినముషిడివాడ అర్బన్ హెల్త్ సెంటర్
- 10న 89వ వార్డు చంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ..
- 12న ముత్యాలమ్మ కాలనీ యూపీహెచ్‌సీలో..
- 17న వేపగుంట కమ్యూనిటీ హాలులో..
- 18న యూపీహెచ్‌సీ పురుషోత్తపురంలో..
- 20న బుచ్చిరాజుపాలెం-యూపీహెచ్‌సీలో..
- 25న పెందుర్తి యూపీహెచ్‌సీలో..
- 30న నరసింహానగర్-5 యూపీహెచ్‌సీ పరిధి(లక్ష్మీనగర్)లో జరుగుతాయని తెలిపారు.



చంద్రనగర్‌లో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది, వలంటీర్లు

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



సాహిత్యను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

విశాఖ విద్య: సివిల్స్‌లో 24వ ర్యాంకు సాధించిన సాహిత్యను ఎన్ఏడీ కూడలిలోని రామకృష్ణ స్కూల్ నిర్వాహకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సాహిత్య తన విజయానికి కారణమైన అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. ప్రతీ ఓటమి విజయానికి నాంది కావాలని, గెలిచే వరకు వెనుకంజ వేయకూడదన్నారు. పాఠశాల సంచాలకుడు కృష్ణా రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్రుడు, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం



సమావేశాలు ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 10వ ద్వి-వార్షిక సర్వసభ్య సమావేశాలు మంగళవారం తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐఆర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెయింటెనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వీరిని సూపర్‌వైజర్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఐఆర్ గుర్తింపు పొందిన యూనియన్ల పోరాటంతో త్వరలోనే ఎన్‌పీఎస్ రద్దవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేకే, కే-ఆర్ లైన్‌లో ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు వర్క్ టు రూల్ అమలు చేయాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, జనల్ కో-ఆర్డినేటర్ టి.వి. మాహేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్లలోకి వచ్చిన కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న కిరణ్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎన్ఎస్‌టీఎల్ వెనుక గోడ సమీపం నుంచి ఇళ్లల్లోకి మంగళవారం కొండచిలువ రావటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇంటి కాంపౌండ్ వాల్‌లోకి వచ్చి బాత్‌రూమ్‌కు సమీపంలోని పొదల్లో దూరటంతో విషయాన్ని స్నేక్ స్నేచర్ కిరణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో కిరణ్ అక్కడకు చేరుకొని సుమారు 8 అడుగుల కొండచిలువను పట్టుకొని తీసుకెళ్లారు. దీంతో అక్కడి వాసులంతా ఊపిరిపీల్చుకున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా సాయం అందిస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు 466 సచివాలయం పరిధిలో నివాసముంటున్న జి. పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, గేదెలమురళీకృష్ణ అందించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ నందిని, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం పవిత్రాల సమర్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వైదికులు రాత్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తులు, ఇతర దేవతామూర్తులు, ఆలయ శిఖరం, ఆలయ ప్రాంగణాలకు పవిత్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవమూర్తుల చెంతన విశేష హోమాలు, పారాయణాలను వైదికులు నిర్వహించారు. బుధవారం పవిత్ర విసర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. బాజీ జంక్షన్‌లోని కుమార్ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాడాలని, సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. మీ తల్లి దండ్రులు వాహనంపై వెళ్లినపుడు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించాలని తెలిపారు. రహదారి భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించినవారవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రాఫిక్ ఇబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బహుభాషా అంతర్జాతీయ సదస్సు



బహు భాషా ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతి సౌజన్యంతో కన్వీనర్, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పీకే జయలక్ష్మి నేతృత్వంలో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక తత్వాన్ని నేటి యువతకు అందించాల్సి బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇలాంటి బహుభాషా సదస్సులు అధ్యాపకులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు, ఆధ్యాత్మిక వేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలుగు, హిందీ, సంస్కృత సాహిత్యాలు, ఇతిహాసాలు, పురాణాల్లో ప్రవచించిన ఆధ్యాత్మిక తత్వాన్ని వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, సాహితీ వాచస్పతి డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ సుమన్ లత, డాక్టర్ నళినిదత్త, డాక్టర్ సుధ, డాక్టర్ కృష్ణబాబు, నిర్మల, డీకే రాజు, డాక్టర్ దీప్తి, ప్రమీల, వీణ, గౌరీనాయుడు, తెలుగు, హిందీ, సంస్కృతం, ఫ్రెంచ్, ఆంగ్ల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు పెద్దపీట

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సింహాచలం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు సకాలంలో పరిష్కారం కాకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని విశ్రాంత న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. పెందుర్తి ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల హక్కు చట్టం చాలా పవర్‌ఫుల్ అని గుర్తు చేశారు. వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థ అందించాల్సిన సేవలకు నిర్దిష్ట కాల పరిమితిని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించిందని చెప్పారు. ఆ నియమావళి ప్రకారం సేవలు అందించకుండా సంస్థ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అయితే వినియోగదారులు ముందుగా తమ ప్రాంత ఏఈఈకి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే 1912 టోల్‌ఫ్రీకి కూడా ఫిర్యాదు చేయాలన్నారు. అలా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోతే న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వం, నైపుణ్యాలపై అవగాహన



అజిత్‌కుమార్‌ని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి, తదితరులు

ఏయూ క్యాంపస్: నాయకత్వ లక్షణాలు వ్యక్తి ప్రగతిని, వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వీడీఎం ఇండియా ఆన్ దమూవ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నాయకత్వ నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. సమూహంగా పని చేయడం, సమష్టిగా విజయం సాధించడం, నాయకత్వం వహించడం వంటి విభిన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, వ్యవస్థను ప్రభావితం చేసే వ్యక్తులుగా ఎదగాలన్నారు. నాయకత్వంలో విధానాలు, పెంపొందించే అంశాలు, ప్రాధాన్యతలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి, విభాగాధిపతి ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కార గ్రహీతకు సత్కారం



సరస్వతి విద్యార్థిని సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచార్య పురస్కారం అందుకున్న ఏయూ సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి విద్యార్థిని మంగళవారం ఉదయం విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీ షణ్ముఖానంద సభ నుంచి ఆమె ఈ పురస్కారం స్వీకరించిన సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును అందుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆచార్య సరస్వతి విద్యార్థి కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ భారతీయ సంగీతం, సాహిత్యం ఎంతో విశిష్టమైనవన్నారు. విభాగాధిపతి ఆచార్య అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు శిక్ష

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యూపోర్టు, హార్బర్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందిని ఒకటో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్‌కు 10 రోజులు జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి మొత్తంగా రూ.1.78 లక్షలు జరిమానా వేశారు. ఆరిలోవ పరిధిలో 16 మందికి రూ.30,500, పీఎం పాలెం పరిధిలో 14 మందికి రూ.49 వేలు, గోపాలపట్నం స్టేషన్ పరిదిలో 10 మందికి రూ.26 వేలు, పెందుర్తిలో 20 మందికి రూ.47,500 జరిమానా విధించారు. అలాగే కంచరపాలెం స్టేషన్ పరిధిలో 20 మందికి రూ.1.04 లక్షల జరిమానా విధించడంతో పాటు వారిలో ఏడుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. గాజువాక పరిధిలో 15 మందికి రూ.38 వేలు, టూ టౌన్ స్టేషన్ పరిధిలో 15 మందికి రూ.1.19 లక్షలు జరిమానా వేశారు.

దీపారాధనలు.. అన్నసమారాధనలు



దీపారాధనను ప్రారంభిస్తున్న బద్రీనాథ్, కొణతాల సుధ



వినాయకుడిని దర్శించుకుంటున్న నమ్మి శ్రీను, యూత్‌సభ్యులు



63వ వార్డులోని గణనాథుని మండపం నిర్వహించిన దిపోత్సవం

విశాఖ విద్య: వినాయక నవరాత్రి ఉత్సవాలను పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దీపారాధనలు, హోమాలు వంటి పూజలు చేస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు.

- జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం అన్నసమారాధన చేశారు. ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నమ్మి శ్రీను తదితరులు పాల్గొని గణనాథుడికి పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, యూత్ కమిటీ సభ్యులు కుమారస్వామి, అప్పలరాజు, రామచంద్రరావు, వంశీ, శంకర్, శివ పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష దీపారాధన

మల్కాపురం: వినాయక నవరాత్రుల్లో భాగంగా మల్కాపురం గొల్లవీధియాదవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం లక్ష దీపారాధన నిర్వహించారు. ఓం కారం మంత్రంతో కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఈ దీపారాధన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ప్రారంభించారు.

- 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద నిర్వహించిన అన్న సమారాధనను పారిశ్రామిక ప్రాంత వైఎస్సార్‌టీయూ ప్రెసిడెంట్ సురేష్‌యాదవ్ ప్రారంభించారు.
- స్థానిక ఐవోసీ వద్ద గల చింతామణి దుర్గాగణపతి ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మందిరం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

అన్నసమారాధనలు

గోపాలపట్నం: వినాయక చవితి సందర్భంగా పలు వీధుల్లో అన్నదానాలు నిర్వహించారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో నిర్వహించిన అన్నసమారాధనలను వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి, గోపాలపకృష్ణ, గేదెల మురళీకృష్ణ ప్రారంభించారు. వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా గణేష్ నవరాత్రి వేడుకలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం, అంబేడ్కర్‌కాలనీ, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రకాషనగర్‌లో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరాడ అనుదీప్ సారథ్యంలో అన్నసమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు పాల్గొని స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలో గణనాథ యంగ్‌యూత్ ఆధ్వర్యంలో మంగళవారం దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని వివిధ దేవతల ప్రతిరూపాలను, ముగ్గలను తీర్చిదిద్ది దీపాలతో అలంకరించారు.
- జైఆంధ్రకాలనీలో మోడరన్ గైస్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి విగ్రహాన్ని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

పలు మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు మంగళవారం నిమజ్జనోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై పురవీధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.




అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లక్ష్మణరావు



కొత్తపాలెంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నాయకులు

మానవతా విలువలు అవసరం



రవీంద్ర శుక్లాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మానవతా విలువలు యువత కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పూర్వ విద్యాశాఖ మంత్రి డాక్టర రవీంద్ర శుక్లా అన్నారు. మంగళవారం ఆయన ఏయూ హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలను విద్యా వ్యవస్థలో అంతర్భాగం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా తాను పనిచేసిన సమయంలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని నిలుపుతూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర శుక్లాను హిందీ విభాగ ఆచార్యులు నల్ల సత్యనారాయణ, ఆచార్యులు, పరిశోధకులు, తదితరులు ఘనంగా సత్కరించారు.